క్లుప్తంగా

వ్యాక్సిన్‌తో గర్భాశయ క్యాన్సర్ నియంత్రణ



పిల్లలకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ సరోజిని

జగదాంబ: తొమ్మిది నుంచి పద్నాలుగేళ్ల ఆడపిల్లలకు సెర్వారాక్ వ్యాక్సిన్ వేయడం ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ను నియంత్రించవచ్చని జిల్లా ఆరోగ్యశాఖ మాజీ అధికారి డాక్టర్ సరోజిని అన్నారు. సోమవారం పాత పోస్టాఫీసు మత్స్యకారుల భవనంలో జర్నలిస్టుల ఆడపిల్లలకు సెర్వారాక్ వ్యాక్సిన్ రెండవ డోస్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాక్సిన్ ద్వారా వైరస్‌ను అరికట్టగలమన్నారు. ఈ వ్యాక్సిన్ వేసుకునే ఆడపిల్లలకు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలిపారు. తల్లిదండ్రులు భయపడకుండా తమ పిల్లలకు ధైర్యంగా వ్యాక్సిన్ వేయించవచ్చన్నారు. షిరీన్ రెహ్మాన్ ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వుడా చైర్మన్ రెహ్మాన్, షిరీన్ రెహ్మాన్, ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణరావు, జి.శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు జి. వల్లేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామి కల్యాణం రాట



కల్యాణం రాట మహోత్సవంలో వేద పండితులు, భక్తులు

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వేంచేసిన ఉమా చంద్రమౌళీశ్వర స్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కల్యాణం రాట మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు భార్గవ శర్మ, వేదపండితులు వేద మంత్రాల మధ్య ఉడుపు రాటకు కల్యాణ దంపతులు పూజలు చేశారు. విశేష హోమ కార్యక్రమం సందర్భంగా వేద పండితులు మండపారాధన, అగ్నిప్రతిష్ట, ఆవాహనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జీవీ రమాబాయ్, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామచంద్ర స్వామి తిరువీధి ఉత్సవం



స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి (మహారాణిపేట అంబికాబాగ్ రామాలయం) ఆలయంలో స్వామి వార్షిక ఉత్సవాలు గత గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నిత్య పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం వైదిక సదస్యం, తిరువీధి ఉత్సవం జరిపారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం చూర్ణోత్సవం, అవభృదోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి, సాయంత్రం ధ్వజావరోహణం, 11 సాయంత్రం 6 గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగం, పవళింపు సేవ నిర్వహించనున్నారు.

కొట్టుకొచ్చిన గుర్తు తెలియని మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అల్లిపురం: మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధి, గోకుల్ పార్కు వద్దకు సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు సుమారు 50 సంవత్సరాలు వయస్సు కలిగి, బ్లాక్ టీషర్టు, బ్లాక్ కలర్ నిక్కరు వేసుకుని ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 9440796010, 0891-2746866 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని కోరారు.

ప్రత్యేకతలు..

నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్/సెక్టార్ స్కిల్ కౌన్సిల్ క్వాలిఫికేషన్ ప్యాక్, మోడల్ కరికులం ప్రకారం శిక్షణ, వ్యక్తిత్వ అభివృద్ధి, డిజిటల్ అక్షరాస్యత, డబ్బు నిర్వహణ, ఇంటర్వ్యూ సంసిద్ధత, వ్యవస్థాపకతలో నైపుణ్యాలు, ఉపాధి శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్లేస్‌మెంట్ అవకాశాలు, నిబంధనల మేరకు మౌలిక సదుపాయాలు, పరికరాలు అందిస్తున్నారు. ప్రయోగశాల (ల్యాబ్) సెషన్స్ కోసం బోధనా సహాయాలు, వినియోగ వస్తువులు, ముడి పదార్థాలు సమకూరుస్తున్నారు. ట్రైనీలకు ఇండక్షన్ కిట్ (యూనిఫాం, బూట్లు, బెల్టులు, సాక్స్, జనపనార సంచులు, హ్యాండ్‌బుక్స్, నోట్‌బుక్స్) అందిస్తున్నారు. అంతే కాక ల్యాబ్స్‌లో సెక్టార్ స్కిల్ కౌన్సిల్ నిబంధనల మేరకు రూపొందించారు.



ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ బిల్డింగ్

అర్హులు ఎవరంటే..

ఈ సంస్థ అందిస్తున్న పలు కోర్సుల్లో శిక్షణ పొందేందుకు 18 నుంచి 27 ఏళ్ల వయస్సు గల విద్యార్థులు అర్హులు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమో లేదా ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారి నైపుణ్యం మెరుగు పరిచేందుకు, ఉపాధి కల్పనకు శ్రీకారం చుట్టింది హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్. ఈ సంస్థ ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజన సదుపాయం కూడా ఉచితంగా కల్పిస్తోంది. అంతే కాక అధ్యయన సామగ్రి కూడా ఉచితంగానే అందజేస్తోంది. ఇప్పటి వరకు సుమారు 23 వేల మంది నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చింది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఐఎస్‌వో గుర్తింపు కలిగిన ధ్రువపత్రాలను అందజేస్తోంది. హైడ్రోకార్బన్, ప్లంబింగ్, మేనేజ్‌మెంట్, హెల్త్ కేర్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, లైఫ్ సైన్సెస్, రిటైల్ సహా పలు రంగాల శిక్షణలో ఫైవ్‌స్టార్ రేటింగ్ అందుకుంది. ఇప్పటి వరకు ఈ సంస్థ నుంచి శిక్షణ పొందిన వారిలో మహిళలు, ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఇతర సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన యువతలో 78 శాతానికి పైగా వివిధ రంగాల్లో 150కి పైగా కంపెనీల్లో ఉపాధి పొందారు.

యువత.. భవిత



- వేలాది మందికి శిక్షణ.. ఉపాధి కల్పిస్తున్న హెచ్‌పీసీఎల్ నైపుణ్యాభివృద్ధి కేంద్రం
- పలు కోర్సుల్లో విద్యార్థులకు ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పనకు కృషి
- బోధనకు ఆధునిక ల్యాబ్‌లు, తరగతి గదుల నిర్వహణ

డాబాగార్డెన్స్: దేశంలోని **నవరత్న కంపెనీల్లో ఒక్కటైన హెచ్‌పీసీఎల్ తన** సీఎస్ఆర్ ఫండ్స్‌ను సద్వినియోగ పరుస్తోంది. నిరుద్యోగ నిర్మూలనకు తన వంతుగా కృషి చేస్తోంది. యువత నైపుణ్యతకు పదును పెట్టి, వివిధ రంగాల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, శిక్షణ అనంతరం వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించి **వారి జీవితాలకు ఆసరాగా నిలుస్తోంది.** కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ దేశ వ్యాప్తంగా నైపుణ్యాభివృద్ధి సంస్థలను స్థాపించాలని ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థలకు సూచించింది. దీంతో దేశ జాతీయ నైపుణ్యాభివృద్ధి మిషన్‌లో భాగంగా హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ విశాఖపట్నంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌ను 2016 మే నెలలో ప్రారంభించింది. అప్పటి నుంచి వివిధ విభాగాల్లో విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చి, వారిని నైపుణ్యవంతులుగా **తీర్చిదిద్ది**, వివిధ సంస్థల్లో **ఉద్యోగాలు** కల్పిస్తోంది. గత **తొమ్మిదేళ్లగా** వేలాది **మం**దికి శిక్షణ ఇచ్చి, **ఉద్యోగాలు** కల్పించింది. వారు జీవితంలో స్థిరపడేటట్టు కృషి **చేసింది**. ప్రస్తుతం ఈ **సంస్థ** విశాఖ నగర **నడి**బొడ్డు ద్వారకా బస్ **స్టేషన్** (ఆర్టీసీ కాంప్లెక్స్)లో **నెలకొల్పబడింది.**

ఏసీ తరగతి గదులు..

విద్యార్థులకు శిక్షణ అందించే క్రమంలో ఏసీ తరగతి గదులు, ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సోలార్ హీటర్లు, 160 సీలింగ్ సామర్థ్యంతో ఆడిటోరియం, పురుషులు, మహిళలకు వేర్వేరుగా హాస్టల్ సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు.

కోర్సులివి..

ప్లంబర్ (జనరల్), ఫైర్ సేఫ్టీ టెక్నీషియన్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, ప్రాసెస్ ఇన్‌స్ట్రుమెంట్ ఆపరేటర్, రిటైల్ అవుట్ లెట్ అటెండెంట్, ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్, తయారీ, ప్యాకేజింగ్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్, రిటైల్ సేల్స్ అసోసియేట్, సోలార్ పీవీ ఇన్‌స్టాలర్, ఎల్‌పీజీ మెకానిక్, డెలివరీ సిబ్బంది, మల్టీ ఫంక్షనల్ అడ్మినిస్ట్రేషన్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ అసిస్టెంట్, ఫిట్టర్-ఫ్యాబ్రికేషన్, ఇండస్ట్రియల్ వెల్డర్, మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డింగ్, పైపు ఫిట్టర్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, బ్యూటీషియన్, ఫుడ్ అండ్ బేవరేజెస్ అసోసియేట్ వంటి విభాగాల్లో శిక్షణ ఇస్తున్నారు.

నిపుణులను తయారు చేస్తున్నాం..



దేశంలో నైపుణ్యం ఉన్న యువత ఉన్నప్పటికీ వారు అవకాశాలను సరిగ్గా ఉపయోగించలేకపోతున్నారు. వారి ఆసక్తిని బట్టి ఉచితంగా శిక్షణ అందించి, వారి నైపుణ్యానికి సానబడుతున్నాం. శిక్షణ సమయంలో ఉచితంగా భోజనం, వసతి, యూనిఫాం వంటి సదుపాయాలు కల్పిస్తున్నాం. గత తొమ్మిదేళ్లలో 23 వేల మంది యువతకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించాం.

– ఇంతియాజ్ అర్షద్, సీఈవో, ఎస్‌డీఐ

నిరుద్యోగ నిర్మూలనకు కృషి..



నిరుద్యోగ యువతకు వారికి నచ్చిన రంగంలో ఎస్‌డీఐ సహకారంతో ఉచితంగా శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పిస్తున్నాం. ఎస్‌డీఐలో ఫుడ్ అండ్ బేవరేజెస్ అసోసియేట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ప్రొడక్షన్ మెషీన్ ఆపరేటర్, బ్యూటీషియన్ కోర్సుల్లో ఇప్పటి వరకు 500 మందికి శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించాం. ఎస్‌డీఐ యజ్ఞంలో మా సంస్థ కూడా భాగస్వామి అయినందుకు సంతోషిస్తున్నాం. షీలానగర్‌లో గల మా సంస్థలో కూడా 350 మందికి శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించాం.

– సీహెచ్ నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బొల్లినేని మెడ్‌స్కిల్స్

‘మత్స్యకారులు’ పుస్తకావిష్కరణ

డాబాగార్డెన్స్: సముద్రంలో ఉప్పొంగే కెరటాల మాదిరి తమ మత్స్యకారులు ఆటుపోట్లను ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ పేర్కొన్నారు. పిక్కి కోదండరావు రచించిన ‘మత్స్యకారులు’ పుస్తకాన్ని వాసుపల్లి సోమవారం ఆశీల్‌మెట్ట సమీపాన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల గురించి క్లుప్తంగా రాసిన కోదండరావుకు, పశ్చిమ గోదావరి జిల్లా తణుకు అంబేడ్కర్ సాహిత్య అకాడమీ గ్రహీత మురాల నవీన్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. పుట్టుక-వికాసం-అభివృద్ధి అంశాలపై వారు పడుతున్న ఆవేదన, జీవన శైలిపై పుస్తక రూపంలో విడుదల చేయడం అభినందనీయమన్నారు. మత్స్యకారుల కష్టాన్ని, అనుభవించే ఆనంద క్షణాలను కూడా అక్షర రూపంలో చూపించారన్నారు. ఈ గ్రంథం ఒక కులం చరిత్రను ఎత్తి చూపడం కాదన్నారు. వారి కన్నీటి గాథల్ని మనం మరచిపోలేని విధంగా అందించారని వాసుపల్లి తెలిపారు. మత్స్యకారులంటే కేవలం సముద్రంలో వేటకు మాత్రమే పరిమితం కాకుండా ఎన్నో అద్భుతాలు సృష్టించిన వారిలో వారు కూడా ప్రముఖ పాత్ర పోషించారన్నారు. మత్స్యకారుల పిల్లల భవిష్యత్ మెరుగుపడాలని, వారు ఉన్నత విద్య అభ్యసించి, తలరాతలు మార్చుకునే విధంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్ తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకారులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మట్టిదిబ్బ

అల్లిపురం: రోడ్డు మధ్యలో మట్టిదిబ్బ ప్రమాదకరంగా మారింది. బీఆర్ రెడ్డి జంక్షన్ నుంచి డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లే మలుపులో జీవీఎంసీ వాటర్ వర్క్స్ సిబ్బంది వారం రోజుల క్రితం మరమ్మతుల నిమిత్తం గొయ్యి తవ్వి రిపేర్లు చేపట్టారు. అనంతరం వాటర్ పైపును పైకి పెట్టి సుమారు 2 అడుగుల మేర మట్టిని దిబ్బగా వేశారు. ఈ ప్రాంతంలో పెద్ద రావిచెట్టు ఉండటం వల్ల విద్యుత్ దీపాలు లేక రాత్రి సమయంలో కనిపించక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు మట్టి దిబ్బను తొలగించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు.



డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లే మలుపులో రెండు అడుగుల మేర ఏర్పాటు చేసిన మట్టిదిబ్బ

చదువుల తల్లులకు అవార్డుల పంట



తండ్రి అప్పారావుతో కలిసి అవార్డు అందుకుంటున్న నాగ వర్షిణి



అవార్డుతో షేక్ రహీమున్నీసా

డాబాగార్డెన్స్: నిరుపేద కుటుంబానికి చెందిన రొబ్బ నాగ వర్షిణికి షైనింగ్ స్టార్ అవార్డు వచ్చింది. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించి స్కూల్ థర్డ్ టాపర్‌గా నిలిచిన నాగ వర్షిణి, ఇంటర్ ఫలితాల్లో 982 మార్కులు సాధించింది. ఎస్టీ కేటగిరీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. తండ్రి అప్పారావు ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తుండగా, తల్లి గంగా భవానీ కేజీహెచ్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహిస్తోంది. అవార్డు సాధించిన నాగ వర్షిణిని పలువురు అభినందించారు.

ఏవీఎన్ కళాశాల విద్యార్థినికి..

ఏవీఎన్ కళాశాలలో ఇంటర్ హెచ్ఈసీ విద్యార్థిని షేక్ రహీమున్నీసా అత్యధిక మార్కులు సాధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి షైనింగ్ స్టార్ పురస్కారం అందుకుంది. దశాబ్దాల చరిత్ర ఉన్న ఏవీఎన్ కళాశాలలో ఆర్ట్స్ విభాగం చదువుతున్న విద్యార్థిని అత్యధిక మార్కులు సాధించడం ఓ రికార్డని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు పేర్కొన్నారు. 25 ఏళ్ల తర్వాత ఏవీఎన్ కళాశాల నుంచి ఆర్ట్స్‌లో అత్యధిక మార్కులు సాధించి షేక్ రహమున్నీసా అవార్డుకు అర్హత సాధించడం విశేషమన్నారు. మున్నీసా పేరిట వచ్చిన అవార్డు, సర్టిఫికెట్‌ను కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రి నాయుడు ఆ విద్యార్థినికి అందజేశారు. ఈ సందర్భంగా షేక్ రహమున్నీసాను కళాశాల అధ్యాపక బృందం అభినందించింది.

నేడు వేంకటేశ్వరస్వామి తెప్పోత్సవం

డాబాగార్డెన్స్: పోర్టు ఏరియా శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి తెప్పోత్సవ (ప్లవోత్సవం) కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు పోర్టు సహాయ సహకారాలతో శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామిని మేళ తాళాలతో పైలెట్ లాంచీలో కొలువుదీర్చి సముద్రంపై అతి వైభవంగా తెప్పోత్సవం జరిపించనున్నారు.


పట్టణ ప్రణాళికా విభాగానికి వెల్లువెత్తిన ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పట్టణ ప్రణాళిక విభాగానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి ఫిర్యాదులు స్వీకరించారు. అందిన 68 ఫిర్యాదుల్లో అత్యధికంగా పట్టణ ప్రణాళిక విభాగానికి 34 ఫిర్యాదులు రాగా.. రెవెన్యూ విభాగానికి తొమ్మిది, ప్రజారోగ్య విభాగానికి ఆరు, ఇంజినీరింగ్ విభాగానికి పదమూడు, యూసీడీకి నాలుగు, మొక్కల విభాగానికి, జీవీఎంసీ అడ్మినిస్ట్రేషన్ అండ్ అకౌంట్స్ విభాగానికి ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు తెరచుకున్న దొండపర్తి రహదారి



దొండపర్తి జంక్షన్ వద్ద నూతనంగా నిర్మించిన కల్వర్టుపై నుంచి రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు

సాక్షి ఎఫెక్ట్..

అల్లిపురం: రెండు నెలలుగా మూత పడిన దొండపర్తి సూర్యా జంక్షన్‌లోని రహదారి ఎట్టకేలకు తెరుచుకుంది. సోమవారం ‘సాక్షి’ దినపత్రికలో వెలువడిన ‘రెండు నెలలుగా రోడ్డు మూసివేత’ అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. సోమవారం కాంట్రాక్టర్‌తో స్టాపర్లు తీయించి, మట్టి, పిక్క, ఇసుక కుప్పలను తొలగించడంతో వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. దీంతో వాహన చోదకులు, స్థానికులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

ఈఏపీసెట్‌లో నారాయణ ప్రభంజనం

డాబాగార్డెన్స్: ఏపీ ఈఏపీసెట్-2025 ఇంజినీరింగ్ ఫలితాల్లో నారాయణ హాస్టల్ విద్యార్థులు మరోసారి అత్యుత్తమ ఫలితాలను సాధించారని డీజీఎం డి.హనుమంతరావు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో టాప్ 500లో 20 ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. పీటీ ఆనంద్ చక్రవర్తి 45వ ర్యాంకు, కేవీ అరవింద్ కుమార్ 64, పి.ఆదివిష్ణు సుబ్రహ్మణ్యం 80, పి.శ్రీహర్షవర్ధన్ 88వ ర్యాంకు సాధించి సత్తా చాటారు. వీరితో పాటు బి.లక్ష్మీనివాస్ (148), ఎం.పూర్ణసాయి (159), పి.ప్రశాంత్ కార్తీక్ (166), డి.శ్రీకర్ (181), టీజీ విజయ్ కాశ్యప్ (190), ఎల్.సాయి ప్రియతమ్ (218), టీఎస్ఎస్‌బీ చంద్ర అగస్త్య (219), పొట్నూరు కార్తీక్ (224), బి.ఈశ్వర్ తనూజ్ (296), టి.మనోహర్ (308), కుమిలి నవదీప్ (325), కాలపురెడ్డి యశ్వంత్ (355), కేజేకే మహేంద్ర (466), జె.హిమచరణ్ (468), ఎన్వీ సాయి నిఖిలేష్ (484), ఎ.సాత్విక్ (498) ర్యాంకులు సాధించారు. అలాగే అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో సూర్య చరణ్ 10వ ర్యాంకును సాధించగా, వై.షమీర్ కుమార్ 75, జి.జాహ్నవి 100వ ర్యాంకు సాధించారు. జి.శృతి హాసిని (105), ఎల్.సాయి శ్వేత (117), జె.సహజ (128), టి.విశ్వక్ (162), ఎస్.శ్రీధర్ (202), పి.జహిత (238), బీడీ భార్గవి (239), పి.హర్షిత్ (351), ఎం.జె.ఎస్.శ్రీవైష్ణవి (425), జి.నవ్యశ్రీ (496) కూడా 500 లోపు ర్యాంకులను సొంతం చేసుకున్నారు.



ఇంజినీరింగ్ విభాగంలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు

ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

బీచ్‌రోడ్డు: సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీలకు)కు మాన్యువల్ పద్ధతిలోనే బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలని విశాఖ జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకుడు డి.గోపినాథ్ ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఉపాధ్యాయులు నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దీక్ష శిబిరాన్ని ఉద్దేశించి గోపినాథ్ మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్‌కు అవకాశం కల్పించాలన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 2,500 నుంచి 3,000 మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. నాయకులు టి.రామకృష్ణ, జి.చిన్నబ్బాయి, ఆరుద్ కుమార్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

తక్షణం సమస్యలు పరిష్కరించాలి

జగదాంబ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జీవీఎంసీ జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. సోమవారం జోన్-4 కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి యూసీడీ నుంచి 2, రెవెన్యూ విభాగం నుంచి 3, టౌన్‌ప్లానింగ్ నుంచి 1 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ గ్రీవెన్స్ సెల్ ద్వారా వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. అర్జీలతో వచ్చిన ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఇంజినీరింగ్ అధికారి నర్సింహారావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఝాన్సీ, యూజీడీ, ఎలక్ట్రికల్ ఏఈలు, తాగునీటి విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుతో మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జర్నలిస్టు చట్టాల రద్దు తగదు

మహారాణిపేట: దేశవ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టులకు సంబంధించిన రెండు చట్టాలను కేంద్రం రద్దు చేయడం తగదని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ అన్నారు. ఆ చట్టాల రద్దును నిరసిస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వర్కింగ్ జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలతో శాంతియుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు, నారాయణ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులకు సంబంధించిన చట్టం 1955లో కేంద్రం అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. అలాగే వేతనాలు చెల్లింపునకు సంబంధించిన చట్టం 1958 నుంచి అమల్లో ఉందన్నారు.70 ఏళ్ల తర్వాత ఈ రెండు చట్టాలు రద్దు చేయడం వల్ల జర్నలిస్టులకు తీవ్రంగా నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. కాబట్టి కేంద్రం రద్దు చేసిన ఈ రెండు చట్టాలను జర్నలిస్ట్‌ల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తక్షణమే పునరుద్ధరించాలని శ్రీనుబాబు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కొరవడిందని, ఉద్యోగ భద్రతతో పాటు వేతనాల చెల్లింపులు, దాడుల నియంత్రణకు సంబంధించి సరైన చట్టాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యదర్శి జి. శ్రీనివాస్ రావు, బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల జిల్లా అధ్యక్షుడు ఇరోతి ఈశ్వర్ రావు, కార్యదర్శి కె. మదన్, చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడు జగన్మోహన్, జర్నలిస్టు కృష్ణ మూర్తి నాయుడు, శ్రీనివాస్ నాయుడు, కామన్న, కేవీ శర్మ, చక్రి, నాయుడు, సత్యనారాయణ. నగేష్ బాబు, శ్రీ లత, మాధవి గౌతమ్, వినయ్, శివ పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

ఎన్‌టీఆర్ నిజమైన వారసుడు ఎవరు?

- జూనియర్ ఎన్టీఆరా.. నారా లోకేషా?
- తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ సూటి ప్రశ్న

డాబాగార్డెన్స్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు నిజమైన రాజకీయ వారసులు ఎవరో ప్రకటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అడుగుతున్నానని తెలుగుశక్తి అధ్యక్షుడు, స్వర్ణాంధ్ర ఎంటర్ ప్రైజెస్ అధినేత బలుసు వెంకటరామ్ (బీవీ రామ్) డిమాండ్ చేశారు. సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రరాష్ట్ర ప్రజలు ఎంతో ఆశతో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమిని గెలిపించారని అన్నారు. ఈ కూటమి ప్రభుత్వం పని తీరుపై రాష్ట్రంలో ఉన్న ఇరవై ఆరు జిల్లాల్లో చర్చ జరుగుతోందని, పని చేయని ఎమ్మెల్యేలను వదులుకుంటానని సాక్షాత్తు ముఖ్యమంత్రే చెప్పారంటే, ప్రభుత్వ పనితీరు బాగోలేదని చంద్రబాబునాయుడు ఒప్పుకున్నట్లేనని బీవీ రామ్ చెప్పారు. ఎన్టీఆర్ వారసుడు ఎవరని బీవీ రామ్ సూటిగా ప్రశ్నించారు? నందమూరి వంశానికి చెందిన జూనియర్ ఎన్టీఆరా! నారా లోకేషా! అన్నది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తాను 11 ఏళ్ల కిందట పార్టీలో చేరానని, గత ఐదేళ్లుగా పార్టీ పురోభివృద్ధికి శక్తి వంచన లేకుండా శ్రమించానని తెలిపారు. అటువంటి తనపై దాడి చేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కనీసం స్పందించలేదన్నారు.



మాట్లాడుతున్న బీవీ రామ్

ఉత్సాహంగా యోగాంధ్ర వేడుకలు

ఆరిలోవ: జీవీఎంసీ, సచివాలయాల సిబ్బంది, ఆర్పీలు, వార్డుల్లో స్థానికులకు యోగాపై అవగాహన కల్పిస్తున్నారు. జోన్-2 పరిధి 9, 10, 11, 12, 13 వార్డుల్లో సోమవారం యోగాంధ్ర వేడుకలు నిర్వహించారు. పిల్లలు, స్థానికులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా వార్డుల్లో ర్యాలీలు చేసి యోగా వల్ల కలిగే ఉపయోగాల గురించి సిబ్బంది తెలియజేశారు. యోగాతో ఆరోగ్యం పొందడంతోపాటు మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. ప్రతిరోజు దినచర్యలో భాగంగా యోగా చేయాలన్నారు. ఈ నెల 21న విశాఖలో జరగనున్న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఆయా వార్డుల నాయకులు, పలు కాలనీల సంఘాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.